క్లుప్తంగా

31తో ముగియనున్న గడువు

తాళ్లరేవు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ప్రవేశాలకు సంబంధించి ఈనెల 31తో గడువు ముగుస్తుందని, చేరాలనుకునే వారు తక్షణమే కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కేవీ సత్యనారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కారణంగా కళాశాలలో ఈ ఏడాది ప్రవేశాలు పెరిగాయన్నారు. గతేడాది 131 మంది విద్యార్థులు కళాశాలలో చేరగా.. ఈ ఏడాది 171 మంది విద్యార్థులు చేరారన్నారు. తల్లికి వందనం పథకం అమలుతోపాటు, సన్నబియ్యంతో కూడిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకం ద్వారా పుస్తకాలు, రికార్డులు అందజేయడంతో తమ కళాశాలలో ప్రవేశాలు పెరిగాయని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

రోడ్డు వేశారు.. బెర్మలు మరిచారు



బెర్మలు వేయకపోవడంతో ప్రమాదకరంగా ఉన్న సీసీ రోడ్డు

తాళ్లరేవు: యానాం–కాకినాడ రహదారి నుంచి నీలపల్లి గ్రామంలోకి లక్షలాది రూపాయల వ్యయంతో రోడ్డు నిర్మించి బెర్మలు వేయకుండా వదిలేశారు. దీంతో ప్రమాదాలు జరిగి వాహనచోదకులు, పాదచారులు క్షతగాత్రులవుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో రహదారిపై వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు వాటిని తప్పించుకునే క్రమంలో రోడ్డుపై నుంచి కిందకు పడి గాయపడుతున్నారు. ఇటీవల ఓ ట్రాక్టరు బోల్తా పడిన ఘటనలో పలువురికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. ఈ రహదారిలో నిత్యం అనేక మంది విద్యార్థులు, కార్మికులు ప్రయాణిస్తూ ఉంటారని, వారికి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు తక్షణమే స్పందించి గ్రావెల్‌తో బెర్మలు వేయాలని స్థానిక నాయకుడు పందిరిపల్లి రాజేష్ కోరారు.

చెట్టును తొలగించాలని వినతి

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి గ్రామ పంచాయతీ సిద్ధార్థనగర్ ప్రాంతంలో రోడ్డుకు అడ్డుగా ఉన్న కొబ్బరి చెట్టును తొలగించాలని గ్రామస్తులు తహసీల్దార్ పీఎస్ దివాకర్‌కు సోమవారం వినతిపత్రాన్ని అందించారు. గ్రామంలో వడ్డివారిపేట, భీమ్‌నగర్, బీరవారిపేట ప్రాంతాల ప్రజలు ఈ మార్గం ద్వారా ప్రధాన రహదారి చేరుకుంటామని, రోడ్డుకి అడ్డుగా చెట్టు ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాను అందించే 11కేవీ వైర్‌కు ఈ చెట్టు ఆనుకొని ఉందని, చెట్టును తొలగించి ప్రమాదాలను నివారించాలని తహసీల్దార్‌ను కోరారు.

ప్రిన్సిపాల్‌ను అరెస్టు చేయాలి

అమలాపురం టౌన్: దళిత యువకుడు దోనిపాటి మహేష్ కేసుతో సంబంధం ఉన్న రాయల్ కళాశాల ప్రిన్సిపాల్ గుత్తుల విజయ్ కుమార్‌ను కూడా అరెస్ట్ చేయాలని డీఎస్పీ ప్రసాద్‌ను కోరినట్లు వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణ తెలిపారు. పలు దళిత సంఘాల నేతలు సోమవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆయనను కలిసి ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. మహేష్‌పై జరిగిన హత్యాయత్నంలో ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ ప్రధాన పాత్ర పోషించాడని, కేసులో ప్రధాన నిందితుడిగా విజయ్‌కుమార్‌ను చేర్చాలని దళిత నేతలు డీఎస్పీకి వివరించారు. సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, మాల మహానాడు నాయకుడు గిడ్ల వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.దుర్గారావు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి శెట్టిబత్తుల తులసి, సాపే రమేష్ తదితరులు డీఎస్పీని కలిసిన వారిలో ఉన్నారు.

ఆర్థిక సాయం

యానాం: తాళ్లరేవు మండలంలోని పటవల హైవేపై ఇటీవల ప్రైవేట్ బస్సు ఆటోను ఢీకొన్న ప్రమాదంలో మరణించిన యానాం కురసాంపేటకు చెందిన ఆటో డ్రైవర్ కుమార్‌రాజా కుటుంబాన్ని సోమవారం స్థానిక నాయకుడు తోటరాజు పరామర్శించారు. చిన్న వయసులోనే కుమార్ రాజా చనిపోవడం చాలా బాధాకరమన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు.

నేడు సీఎస్ఆర్ గ్రంథావిష్కరణ

యానాం: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)పై వివిధ అంశాలను క్రోడీకరిస్తూ విశ్రాంత ఆర్‌ఏఓ, డిప్యూటీ డైరెక్టర్ కమ్ అండర్ సెక్రటరీ గిడ్డి బలరామ్ రచించిన పుస్తకాన్ని మంగళవారం ఆవిష్కరిస్తున్నట్లు యానాం బీఆర్ అంబేడ్కర్ సంక్షేమ సంఘం ఓ ప్రకటనలో తెలిపింది. స్థానిక సర్కిల్ ది యానాం భవనంలో మధ్యాహ్నం మూడు గంటలకు జరిగే గ్రంథావిష్కరణ సభకు పలువురు దళిత నాయకులు, విశ్రాంత అధికారులు, సామాజిక కార్యకర్తలు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఐ.పోలవరం: మండలంలోని గుత్తెనదీవిలో రూ.38 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డు, జి.వేమవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.40 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను, ఇ.వేమవరంలో రూ.21 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను, జి.వేమవరంలో రూ.1.75లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, శాసనమండలి సభ్యుడు పేరాబత్తుల రాజశేఖర్ సోమవారం శంకుస్థాపన చేశారు.

బాబోరూ.. డబ్బు ఇవ్వరూ

- టిడ్కో ఇళ్లకు చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వాలి
- ఏడేళ్లుగా ఇవ్వని సొమ్ము వడ్డీతో సహా చెల్లించాలి
- కౌన్సిల్ సమావేశంలో ధ్వజమెత్తిన ఎమ్మెల్సీలు



మున్సిపాలిటీపై ధ్వజమెత్తుతున్న ఎమ్మెల్సీలు ఇజ్రాయిల్, సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: ఏడేళ్ల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వంలో పట్టణానికి సంబంధించి బోడసకుర్రులో ఏర్పాటు చేసిన టిడ్కో ఇళ్ల కోసం 72 మంది లబ్ధిదారుల నుంచి రూ.లక్ష చొప్పున కట్టించుకుని నేటికీ వారికి ఇళ్లు, డబ్బు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం సరికాదని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ధ్వజమెత్తారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన కౌన్సిల్ సమావేశానికి ఎమ్మెల్సీలు ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణ రావు హాజరై పలు సమస్యలపై మాట్లాడారు.

డబ్బులు ఇవ్వకపోవడం దారుణం

ఏడేళ్ల నుంచి టిడ్కో ఇళ్లు ఇవ్వకపోగా.. వారు కట్టిన డబ్బులు కూడా ఇవ్వకపోవడం దారుణమని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటి కోసం తాము చెల్లించిన డబ్బును ఎన్నో సార్లు మున్సిపాలిటీ అధికారులను అడిగి విసుగు చెందిన లబ్ధిదారులు జిల్లా కలెక్టరేట్ ముందు సోమవారం ధర్నా చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. వివిధ కారణాలతో లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించకపోయినప్పటికీ వారు చెల్లించిందైనా ఇచ్చేయాలి కదా..? అని ఆయన ప్రశ్నించారు. వారు చెల్లించిన దానికి వడ్డీతో సహా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్ వివరణ ఇవ్వాలని పట్టుబట్టారు. ఆ రోజు టిడ్కో ఇళ్ల కోసం తీసుకున్న డబ్బు ప్రభుత్వం వద్దే ఉందని, వాటిని మున్సిపాలిటీ సాధారణ నిధుల నుంచి ఇవ్వడం సాధ్యం కాదని బదులిచ్చారు. ఈ సమస్య రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లో ఉందని కమిషనర్ వివరణ ఇచ్చారు. దీనిపై మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేసి ఈ తీర్మాన కాపీని తనకు ఇస్తే శాసనమండలిలో తాను డబ్బు కోసం నిలదీస్తానని చెప్పడంతో కౌన్సిలర్లు అందరూ తీర్మానం చేసి ఇస్తామని పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు మూకుమ్మడిగా స్పష్టం చేశారు.

రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను పునరుద్ధరించాలి

స్థానిక మున్సిపల్ సర్క్యులర్ బజారు (షాపింగ్ కాంప్లెక్స్)లో గతంలో ఇచ్చిన రైల్వే టిక్కెట్ రిజర్వేషన్ కౌంటర్‌ను మున్సిపాలిటీ పునరుద్ధరించాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు డిమాండ్ చేశారు. ఇందుకోసం రెండు మున్సిపల్ షాపులను ఎప్పటిలాగే రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌కు కేటాయించాలని కోరారు. అలాగే సర్క్యులర్ బజార్ ఉన్న ప్రాంతమే కాకుండా దాని చుట్టూ ఉన్న ప్రాంతమంతా ఒకప్పుడు కంచర చెరువుగా ఉండేదని ఎమ్మెల్సీ గుర్తుచేశారు. ఈ చెరువు ఆక్రమణలపై గతంలోనే తాను హైకోర్టుకు వెళ్లానన్నారు. ఆక్రమణలపై కమిషనర్ ప్రత్యేక దృష్టి పెట్టి వాటిని మున్సిపాలిటీ స్వాధీనం చేసుకొని విలువైన స్థలాలను కాపాడాలని ఎమ్మెల్సీ సూచించారు. అలాగే పట్టణంలో మెయిన్ రోడ్ల వెంబడి కొందరు దుకాణదారులు డ్రెయిన్లపై సిమెంట్ స్లాబ్‌లు, బల్లలతో మూసివేసి పారిశుధ్య సమస్యలకు కారణమవుతున్నారని ఆరోపించారు. దీనిపై కూడా కమిషనర్ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

సర్క్యులర్ బజార్‌లో నిర్వహణ లోపం?

55 షాపులతో మున్సిపాలిటీలో అతిపెద్ద షాపింగ్ కాంప్లెక్స్ (సర్క్యులర్ బజార్) నిర్వహణ లోపంతో పాడైపోతుందని కౌన్సిలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఏడాది షాపింగ్‌ల ద్వారా రూ.కోటి ఆదాయం వస్తున్నా.. ఆ షాపులను కాపాడుకోవడంలో నిర్లక్ష్యం కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద షాపింగ్ కాంప్లెక్స్‌లో మరుగు దొడ్లు లేవని, స్లాబ్‌లు పాడై వర్షాలకు లీకవుతున్నాయని కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, సంసాని బులినాని, గొవ్వాల రాజేష్, యేడిద శ్రీను అధికారులపై ధ్వజమెత్తారు.

వీధి దీపాల నిర్వహణ అధ్వాన్నం

పట్టణంలో వీధి దీపాల నిర్వహణ అధ్వాన్నంగా ఉందని కౌన్సిలర్లు చిట్టూరి పెదబాబు, మట్టపర్తి నాగేంద్ర, తిక్కా సత్యలక్ష్మి, బండారు గోవిందు తదితరలు ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు కూడా కౌన్సిలర్లు లేవనెత్తిన సమస్యలపై స్పందించారు. వీధి దీపాల నిర్వాహణకు సంబంధించి పాత కాంట్రాక్టర్‌కు ఫైనల్ బిల్లు చెల్లించవద్దని, ఆ కాంట్రాక్టర్ వల్లే వీధి దీపాల నిర్వాహణ ఇంత దారుణంగా ఉందని ఆరోపించారు. కౌన్సిలర్లు చేసిన సూచనల ప్రకారం చర్యలు చేపడతానని కమిషనర్ అన్నారు. మున్సిపల్ డీఈఈ కె.సత్యనారాయణ, ఏఈలు వెంకటేష్, భాస్కరరావు కౌన్సిలర్లు లేవనెత్తిన పలు సమస్యలపై మాట్లాడారు.

అప్రమత్తతతో హెపటైటిస్ అదుపు



హెపటైటిస్‌పై అవగాహన ర్యాలీ చేస్తున్న ప్రభుత్వాస్పత్రి వైద్యులు

అమలాపురం టౌన్: ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా పట్టణంలో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యులు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హైపటైటిస్–బీ, సీ విషయంలో నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలను హరిస్తాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు అన్నారు. అప్రమత్తతతోనే ఈ వ్యాధిని పూర్తిగా అదుపులో పెట్టుకునే అవకాశాలు, సూచనలను ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ కె.అనూష, ఆస్పత్రి జనరల్ మెడిసెన్ ఎండీ డాక్టర్ కె.రవితేజ వివరించారు. కలుషిత తాగునీరు తీసుకోవడం వల్ల కాలేయ సంబంధిత రోగాలు వస్తాయని వైద్యులు తెలిపారు. కామెర్ల వ్యాధి ద్వారా కాలేయం పాడయ్యేలా హెపటైటిస్ చేస్తుందన్నారు. అసహజ లైంగిక చర్యలు, తరుచూ రక్త మార్పిడి, డయాలిసిస్, డ్రగ్స్ తీసుకోవడం, మద్యపానం, వాడిన సిరంజిలను మళ్లీ వినియోగించడం వల్ల హెపటైటిస్–బీ, సీ వ్యాధుల సంక్రమించే అవకాశం ఉందని వివరించారు. దానిని నిర్లక్ష్యం చేస్తే దీర్ఘకాలం తర్వాత సిర్రోడిస్, లివర్ క్యాన్సర్‌కు దారి తీసే ప్రమాదం ఉందని తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి నుంచి స్థానిక నల్ల వంతెన వరకూ వైద్యులు, వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఆస్పత్రి జనరల్ సర్జన్ రమ్య, నర్సింగ్ సూపరింటెండెంట్ రాజరాజేశ్వరితోపాటు, ఆస్పత్రి నర్సులు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక కార్యాచరణతో సత్ఫలితాలు



విద్యార్థినులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్

అమలాపురం టౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం చేపట్టిన ప్రత్యేక కార్యాచరణతో సత్ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ సాధనాల శాంతి రాజశ్రీ తెలిపారు. కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, గత విద్యా సంవత్సరంలో 92 ప్రవేశాలు జరగగా.. ఈ విద్యా సంవత్సరంలో 101 ప్రవేశాలు సాధించామన్నారు. ఈ ప్రత్యేక కార్యాచరణలో తమ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది సంయుక్తంగా చేపట్టి ఈ ఫలితాలు సాధించారన్నారు. కళాశాలలో చేరిన, చదువుతున్న విద్యార్థినులకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ప్రత్యేక సౌకర్యాలు, నోట్ పుస్తకాల పంపిణీ, తల్లికి వందనం లబ్ధి, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు సమకూరుతున్నట్లు ప్రిన్సిపాల్ వివరించారు. వచ్చే విద్యా సంవత్సరంలో కూడా ఇదే కార్యాచరణతో మరిన్ని ప్రవేశాలు సాధిస్తామని ఆమె పేర్కొన్నారు. విద్యార్థినులకు ప్రిన్సిపాల్ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకుడు అడబాల శ్రీనివాసరావు, లైబ్రరీ ప్రతినిధి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రహదారుల పనులు పూర్తి చేయాలని ధర్నా



తాళ్లరేవు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తాళ్లరేవు: కాకినాడ నుంచి అమలాపురం వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని, రోడ్డు ప్రమాదాల నుంచి ప్రజలను రక్షించాలని కోరుతూ సోమవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ ధర్నాను ఉద్దేశించి నాయకులు మాట్లాడారు. ఎన్‌హెచ్–216 నిర్మాణ సమయంలో అనేక రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాత పడ్డారన్నారు. చాలా వరకు రోడ్డు పూర్తయినప్పటికీ పలుచోట్ల అసంపూర్తిగా వదిలేయడం, ఎన్‌హెచ్ అధికారుల నిర్లక్ష్యం, వాహనాల అతివేగం కారణంగా ప్రమాదాలు జరిగి ఒక్కసారిగా నలుగురైదుగురు మృతి చెందుతున్నారన్నారు. జంక్షన్లలో యారో మార్కులు వేయకపోవడం, డివైడర్ల నిర్మాణం చేపట్టకపోవడం, విద్యుత్ లైట్లు లేకపోవడం తదితర కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రమాదాలు జరగకుండా ఎన్‌హెచ్, పోలీస్, రెవెన్యూ శాఖలు ఉమ్మడిగా సమావేశం నిర్వహించి చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఆయా డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ పితాని త్రినాథరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు టి.ఈశ్వరరావు, వి.రాజబాబు, కె.లక్ష్మణస్వామి, బి.మోహన్, ఏ.బాబూరావు, బి.శ్రీనివాస్, పి.రత్నకుమారి, ఈశ్వరరావు, బుజ్జిబాబు, గోపాలకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలి

అమలాపురం టౌన్: లేఅవుట్ రెగ్యులైజేషన్, పీనలైజేషన్ తాజా నిబంధనల ప్రకారం ప్రభుత్వం ఈ స్కీమ్‌ను పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్ తెలిపారు. అనధికార లేఅవుట్ లేదా అనధికార లేఅవుట్‌లోని ప్లాట్‌లను క్రమబద్ధీకరించుకునేందుకు అవకాశం కల్పిస్తూ కటాఫ్ డేట్‌గా 2025 జూన్ 30 తేదీని నిర్ణయించిందని పేర్కొన్నారు. ఆలోపు అనధికార లేఅవుట్‌లో ప్లాట్‌గా రిజిస్ట్రేషన్ అయిన వాటిని అర్హతగా చేస్తూ జీవో జారీ చేసిందని కమిషనర్ పేర్కొన్నారు. ఈ జీవో జారీ అయిన 90 రోజులలోపు అంటే 2026 అక్టోబర్ 24వ తేదీలోపు ఆన్‌లైన్‌లో ప్రభుత్వ నిబంధనలకు లోబడి దరఖాస్తులు చేసుకోవాలని కమిషనర్ సూచించారు. పట్టణంలోని అనధికార లేఅవుట్లు, ఫ్లాట్లు కొనుగోలు చేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

టిడ్కో ఇళ్ల కోసం కట్టిన డబ్బులివ్వాలని ధర్నా




కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న బాధితులు

అమలాపురం రూరల్: టిడ్కో ఇళ్ల కోసం చెల్లించిన డబ్బులు ఇవ్వాలని బాధితులు స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. 8 ఏళ్ల క్రితం సుమారు 40 మంది బాధితులు టిడ్కో ఇళ్ల కోసం ఒక్కొక్కరూ రూ.లక్ష చొప్పున మున్సిపాలిటీకి చెల్లించామన్నారు. పలు కారణాలతో తమకు కేటాయించిన టిడ్కో ఇళ్లను ఇవ్వలేదన్నారు. తమకు ఇళ్లు కేటాయించని పక్షంలో కట్టిన డబ్బులకు వడ్డీతో సహా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాము పట్టణంలో నివాసం ఉంటున్నామని, మున్సిపాలిటీ జీప్లస్ 3 విధానంలో అల్లవరం మండలం బోడసకుర్రు, దేవర్లంకలో భవనాలు నిర్మించారని తెలిపారు. తాము 2 బీహెచ్‌కే ఫ్లాట్ నిమిత్తం మొదటి విడత రూ.25 వేలు, రెండో విడత రూ.75 వేలు చెలించామన్నారు. వివిధ కారణాల వల్ల ఇచ్చిన ఫ్లాట్లు రద్దు చేశారని పేర్కొన్నారు. మధ్య తరగతికి చెందిన తాము అప్పు చేసిన కట్టిన డబ్బులకు ఇప్పటికీ వడ్డీలు కడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. వడ్డీతో సహా డబ్బులు ఇప్పించాలని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఖాతాదారులకు కో–ఆపరేటివ్ బ్యాంక్ విశేష సేవలు

యానాం: 1958లో ఏర్పడిన పుదుచ్చేరి స్టేట్ కో–ఆపరేటివ్ బ్యాంక్ ఖాతాదారులకు మెరుగైన సేవల లక్ష్యంగా పనిచేస్తుందని పుదుచ్చేరి రిజిస్ట్రార్ ఆఫ్ కో–ఆపరేటివ్ సొసైటీస్ అధికారి యశ్వంతయ్య పేర్కొన్నారు. సోమవారం యానాంలోని కో– ఆపరేటివ్ బ్యాంక్ శాఖ నూతన భవనంలో బ్రాంచ్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి రీజియన్‌లలో శాఖల ద్వారా ఖాతాదారులకు వివిధ రకాల ఋణాలు గృహ, వాహన, వ్యవసాయ, వ్యక్తిగత ఋణాలు, ఏటిఎం సేవలు, ఫిక్సిడ్ డిపాజిట్లు తదితర వాటి గూరించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, ట్రైనీ ఐఏఎస్ అఖిల్, కో–ఆపరేటివ్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఓఎన్‌జీసీ చమురు బావికి రక్షణ కరవు!



చల్లపల్లి జగ్గిరాజు పేటలో నిర్లక్ష్యంగా వదిలేసిన ఓఎన్‌జీసీ చమురు బావి

ఉప్పలగుప్తం: చల్లపల్లి పంచాయతీ పరిధి జగ్గిరాజుపేటలో ఓఎన్‌జీసీ సిబ్బంది నూతనంగా ఏర్పాటు చేసిన బావికి రక్షణ కవచం లేకపోవడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల జగ్గిరాజుపేట ప్రాంతంలో ఓఎన్‌జీసీ అధికారులు నూతన బావిని తవ్వి దాని చుట్టూ రక్షణ కవచంగా ఐరన్ మెస్‌ను ఏర్పాటు చేయకుండా గాలికొదిలేశారు. దీంతో స్థానికంగా నివసించే చిన్నారులు, పశువులు ఆ బావి వద్దకు వెళ్లినప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే ఆ నిర్లక్ష్యానికి బాధ్యులు ఎవరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కోట్లు విలువ చేసే చమురును ఓఎన్‌జీసీ అధికారులు ఈ ప్రాంతం నుంచి తరలిస్తూ ఉప గుత్తేదారులకు పనులను అప్పగించి బాధ్యతారహితంగా వ్యవహరిస్తూ సమస్యలను పట్టించుకోవడం లేదని, ఆ బావి నుంచి శబ్దాలు వస్తుండంతో స్థానికులు భయాదోళనకు గురవుతున్నారని గ్రామ ప్రజలు అన్నారు. తక్షణమే ఓఎన్‌జీసీ అధికారులు స్పందించి రక్షణ కవచాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఉత్సాహంగా ట్వినింగ్ స్కూల్స్

యానాం: రెండు స్కూల్స్ మధ్య పాఠ్య, సహపాఠ్య కార్యక్రమాల్లో ఉత్తమ పద్ధతులను నేర్చుకోవడం ప్రధాన అంశంగా సోమవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్స్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా స్థానిక అయ్యన్న నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పట్టణంలోని భీమ్‌నగర్ బాబు జగ్జీవన్‌రామ్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ప్రధానోపాధ్యాయుడు పోతాబత్తుల శ్రీనివాస్, అయ్యన్ననగర్ ఉపాధ్యాయులు, విద్యార్థులను సాదరంగా ఆహ్వానించారు. అనంతరం విద్యార్థులు పరస్పరం పరిచయం చేసుకుని పాఠశాలలో సౌకర్యాలు, పాఠ్యాంశాలు, సహపాఠ్య కార్యక్రమాల అమలు తదితర వాటి గూరించి తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న కారు



మట్లపాలెం వద్ద కారు ఢీకొనడంతో వ్యక్తికి తీవ్రగాయాలు

తాళ్లరేవు: జాతీయ రహదారి సమీపంలోని మట్లపాలెం వద్ద సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కోరంగి అడిషనల్ ఎస్సై ఎస్.సత్యన్నారాయణ తెలిపిన వివరాల మేరకు.. యానాం నుంచి కాకినాడ బైక్‌పై వెళుతున్న వ్యక్తిని ఎదురుగా వస్తున్న కారు బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో వాహన చోదకుడి తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు హుటాహుటిన అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతున్నాడు. అతని పరిస్థితి విషమంగా ఉందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

డల్లాస్‌లో తెలుగు పేరెంట్స్ అసోసియేషన్ ఏర్పాటు



తెలుగు పేరెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమెరికాలోని డల్లాస్‌లో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన పేరెంట్స్‌తో ఓ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసినట్లు అమలాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు వంటెద్దు వెంకన్నాయుడు అక్కడి నుంచి ఓ ప్రకటనలో తెలిపారు. వెంకన్నాయుడు దంపతుల కుమారుడు అక్కడ ఉద్యోగం చేస్తున్న క్రమంలో వారు ఇటీవల అక్కడికి వెళ్లారు. అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న కుమారుడు, కుమార్తె వద్దకు తెలుగు రాష్ట్రాల నుంచి తల్లిదండ్రులు రావడంతోపాటు, కొన్ని నెలల పాటు ఆ దేశంలోని పిల్లల వద్ద ఉంటున్నారు. ఈ క్రమంలో నాయుడు డల్లాస్‌లోని తమ పిల్లల వద్దకు వచ్చిన దాదాపు వంద మంది పేరెంట్స్‌ను సమావేశపరిచి ఓ అసోసియేషన్ ఏర్పాటు చేశారు. డల్లాస్‌లో ఎవరింట్లో శుభకార్యం జరిగినా ఈ అసోసియేషన్ తరపున పేరెంట్స్ పాల్గొని స్నేహ పూర్వకంగా అందరూ ఓ చోట కలిసే ఏర్పాటు చేసుకున్నారు. కష్ట సుఖాల్లో పాలు పంచుకునేలా పేరెంట్స్ అసోసియేషన్‌ను ఏర్పాటుచేశారు.

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న శామ్యూల్ సాగర్

తాళ్లరేవు: వైఎస్సార్ సీపీని గ్రామస్థాయి నుంచి అభివృద్ధి చేసి పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేస్తామని తాళ్లరేవు జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్ అన్నారు. సోమవారం తాళ్లరేవులో పార్టీ గ్రామ కమిటీ సమావేశాన్ని శామ్యూల్ సాగర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ అభివృద్ధికి నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని పిలుపునిచ్చారు. 'బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న మోసాలను వివరిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు నందికోళ్ల శ్రీమన్నారాయణ, రత్న ముత్యాలు, నాయకులు రెడ్డిబాబు, చిట్టూరి చలపతి, కొల్లు శ్రీను, విత్తనాల పండు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ'

తాళ్లరేవు: మండల పరిధిలోని చొల్లంగి పంచాయతీలో మంగళవారం ఇంటింటికీ బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవింద కుమార్ తెలిపారు. చొల్లంగి గ్రామంలో స్థానిక గురజనాపల్లి జంక్షన్‌లో నాయకులు బూరెల వెంకటరాజు కార్యాలయం వద్ద కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్నం రెండు గంటలకు జి.వేమవరం పంచాయతీ, రాయమెరక గ్రామంలో నాయకులు నీలపాల శ్రీను ఇంటి వద్ద ప్రారంభమవుతుందని తెలిపారు. పార్టీ పరిశీలకులు మాతా మురళి నేతృత్వంలో జరిగే ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలని కోరారు.

విద్యుత్ ఎస్ఈ కార్యాలయానికి శంకుస్థాపన

అమలాపురం రూరల్: ఈదరపల్లిలో విద్యుత్ శాఖ ఈఈ కార్యాలయం వద్ద రూ.33.33 లక్షలతో నిర్మించనున్న ఎలక్ట్రికల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం నూతన భవనానికి ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రాజేశ్వరి, ఈఈ రాంబాబు, డీఈఈ అన్నవరం, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మాజీ జెడ్పీటీసీ జయవెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో నడక చైతన్యాన్ని నింపాలి



నాగేంద్రను సత్కరించిన మహిళా వాకర్స్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: పట్టణ మహిళా వాకర్స్ క్లబ్ ఏర్పడి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మహిళా వాకర్స్ ప్రజల్లో మరింతగా నడక చైతన్యాన్ని నింపాలని అంతర్జాతీయ వాకర్స్ ఉపాధ్యక్షుడు గోకరకొండ నాగేంద్ర సూచించారు. స్థానిక గోఖలే వీధిలో సోమవారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఆయనను మహిళా వాకర్స్ ఘనంగా సత్కరించారు. మహిళా వాకర్స్ ప్రతినిధి యర్రమిల్లి అనంతలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వాకర్స్ జోన్ చైర్‌పర్సన్ దువ్వూరి సుబ్బలక్ష్మి, ఉపాధ్యక్షురాలు గోకరకొండ కరుణశ్రీ, క్లబ్ మాజీ అధ్యక్షురాలు పుత్సా రాజేశ్వరి తదితరుల పాల్గొన్నారు.

సొసైటీ అధ్యక్షుడిగా బాలాజీ

అమలాపురం రూరల్: ఇందుపల్లి సొసైటీ అధ్యక్షుడిగా మోటూరి బాలాజీ, డైరెక్టర్‌లుగా కుడుపూడి ఏడుకొండలు, విప్పర్తి రమేష్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే ఆనందరావు, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు పొలమూరి ధర్మపాల్, మాజీ జెడ్పీటీసీ జయవెంకటలక్ష్మి, సర్పంచ్ చొల్లంగి శివాజీని, మాజీ ఎంపీపీలు బొర్రా ఈశ్వరరావు, యేరుబండి వెంకటేశ్వరరావు, నాయకులు చొల్లంగి సాయిబాబు, మల్లుల పోలయ్య తదితరులు వారిని అభినందించారు.